# గోదారమ్మ-3

కనకమ్మ వైపు కొంచెం నిరసనగా చూస్తూ అడిగింది... "మీ అబ్బాయికి చదువుంది, ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడని అంటున్నారు! చేయనివ్వండి.. మంచి ఉద్యోగం సంపాదించుకుంటాడు. కష్టపడి ఉద్యోగం చేసి ప్రయోజకుడవుతాడు ! నేను డబ్బు ఇవ్వటం ఎందుకండీ...?"

కనకమ్మ చిన్నగా ఆవిడ అమాయకత్వానికి నవ్వినట్లుగా చూసింది.

"బావుంది. మీ దగ్గర డబ్బు ఉంది కదాని ఏమైనా చేయాలనుకుంటున్నారని ఓ మంచి మాట చెబుదామని వచ్చాను. కూలిపనులు చేసుకుని బ్రతుకుతున్నవాళ్ళకి మీరు డబ్బు ధారపోయటం ఏమిటి...? మనం చేసే పనులకి కొంచెం రీతి, నీతి ఉండాలిగా...!"

గోదారమ్మకు ఆమె మాటలకు కోపం బుస్సున పొంగివచ్చింది. కానీ అణచుకుంది.

"నేను కులం చూడనండీ... కష్టాన్ని మాత్రమే గౌరవిస్తాను...!"

ఆ మాటలకు కనకమ్మకు కోపం వచ్చింది. "అంటే...?" తీవ్రంగా చూసింది.

"ఏం లేదూ... మీకు తెలియదుగానీ, నేను సాయం చేస్తానంటే... ఆ నాగులమ్మ ఓ పట్టాన ఒప్పుకోలేదు. కష్టపడి వాళ్ళే డబ్బు కూడబెట్టుకుని కట్టుకుంటామని చెప్పింది. అది నాకు నచ్చింది. అందుకే వా ళ్ళను ఒప్పించి సాయం చేసాను గానీ... అది దానమనీ, పుణ్యం వస్తుందనీ, ఆశించి చేయలేదు! అయినా మన కులం వాళ్ళకే దానధర్మాలు చేయాలని ఉందా? ఎవరికి అవసరమైతే వాళ్ళకి కదా మనం చేయూత నివ్వవలిసిందీ...? నిస్సహాయమైన బలహీనులకు ఆర్థికంగా కొంచెం బలంగా ఉన్న మనలాంటివాళ్ళం చేయి అందించినందుకు... పుణ్యం లాంటి పెద్ద మాటలు అవసరమంటారా...? మీరు మీకున్నంతలో మీ చుట్టు పక్కల వాళ్ళకి ఏదైనా అవసరం వస్తే... చేయగల సాయం చేయండి. సాయం అంటే... కేవలం డబ్బు మాత్రమే కాదుగా....?"

కనకమ్మకి చిరాకొచ్చింది. ఏం జవాబు చెప్పాలో తోచక విసురుగా లేచినిలబడింది. అపుడే గవరమ్మా వచ్చి కూర్చుంది. "అపుడే వెళ్తావా, కనకమ్మా... లేచి నిలబడ్డావూ...?" అనడిగింది.

కనకమ్మ గట్టిగా నిట్టూర్చింది. ఇంతలో ఇద్దర్నీ చూసిన సీత రెండు ఆకు దొన్నెల్లో కిచిడీని పెట్టుకుని వచ్చింది... “ఈ వేళ దేముడికీ నైవేద్యం పెట్టాను. ప్రసాదం కొంచెం నోట్లో వేసుకోండి” చిరునవ్వుతో అందించింది.

సీత తన చేతిలో పెట్టిన దాన్ని అక్కడ పెట్టేసి కనకమ్మ “ఇలాంటి ప్రసాదాలకోసం రాలేదమ్మా...! ఎక్కడినుండో మీ పెద్దమ్మ వచ్చిందంటేను, చూసి పోదామని, ఒక కులం వాళ్ళం కదాని పనిగట్టుకుని వచ్చానంతే. నేనేదో ఒక మంచి మాట చెప్పబోతే, మీ పెద్దమ్మ ఇంకా ఎక్కువే చెప్పారు.” అంటూ గవరమ్మవైపు చూసి “నేను పోతున్నా, పని ఉంది ఇంటి దగ్గర. గవరమ్మా... నువ్వు కూర్చుని... వాళ్ళు చెప్పే నాలుగు మంచి మాటలూ విని వెళ్ళు...!” వ్యంగంగానూ...నిష్టూరంగానూ అంది.

ఆవిడ ధోరణి అర్థం కాని గవరమ్మ విస్తుపోతూ చూసి తలవూపింది. కనకమ్మ వెళ్లిపోతుంటే గవరమ్మ మాత్రం సీతతో “నేనీ ప్రసాదం కూడా తింటాలేమ్మా... నాకు కొంచెం ఆకలిగానే ఉంది!” అంది.

సీత వెంటనే “అయితే పిన్నీ... భోంచేసి వెళ్ళకూడదూ.. వంటకూడా అయింది” అంది ఆదరంగా.

గవరమ్మ తల అడ్డంగా వూపింది.

“మా కోడలు వంట చేస్తుందిలేమ్మా... అదేమిటో... మిట్ట మధ్యాహ్నం వరకూ ఎసరుని పొయ్యి కెక్కించదు... నేనెంత అరిచి మొత్తుకున్నాగానీ...!” అంటూ నిట్టూర్చింది.

గోదారమ్మ ఆవిడ వైపు చిరునవ్వుతో చూసింది...“అయితే మీ కోడలికి మీరంటే బాగా ఆపేక్షన్నమాట!”

గవరమ్మ విచిత్రంగా చూసి “నేనేమో అక్కసు అనుకుంటూంటే, మీరేమిటి ఆపేక్ష అంటున్నారు...?” అనడిగింది.

“మరి... ఆకలి బాగా పుట్టేదాకా ఆపితే... మీరు మరి రెండు ముద్దలు ఎక్కువ తింటారనే ఆలోచనతో మీ కోడలు ఆలశ్యం చేస్తోంది కాబోలని నాకనిపించింది! దాన్ని ఆపేక్ష అనే అంటాంగా...!”

గవరమ్మ పెద్దగా నవ్వింది “మీలా నేను ఆలోచించనే లేదండీ! ఇపుడు ఇంటికి వెళ్ళాక కోడలితో మీరన్నమాట చెప్పి ‘పిచ్చిపిల్లా... ఈ వయసులో నేనెక్కువ తినాల్సిన పని లేదమ్మా... రెండు ముద్దలు తక్కువ తింటేనే మంచిదే’ అని ఈ మాటా చెబుతాను...!” అంది.

గోదారమ్మ "అలా చెప్పి చూడండీ.... మీ కోడలు రేపటినుండీ పెందరాళే వంట ముగించేస్తుంది, చూడండీ!" అని చెబుతూనే మళ్ళీ అంది " ఇపుడే నేనీ రామాయణంలో చదివాను... మాట చేసే మంచి గురించి. హనుమంతుడిని మంచి మాటకుదాహరణగా చెబుతారంటూ ఉదాహరణగా ఇది రాసారు. లంకకు వెళ్ళొచ్చిన హనుమంతుడు 'దృష్టాన్ దేవీ...' అని రాముడికి చెప్పాడట. రాముడు ఉత్సుకతను గమనించి... సీతాదేవి ఎలా వుందో చెప్పటం కన్నా ముందుగా దేవి ని చూసాను...అని చెప్పటంతో మొదలు పెట్టాడని చెబుతారు. సీతాదేవి గురించిన వార్త చెప్పే విధానంలో చూసాననే మాటను ముందుగా చెప్పటం జరిగిందన్నమాట! అర్థమైందిగా... మాటకున్న మహత్తు ! అందుకే కాబోలు మన పెద్దలు 'నోరు మంచిదైతే...ఊరు మంచిదవుతుందీ' అంటారు. అలాగే మీరూ మీ అబ్బాయినీ.. మిమ్మల్నీ నమ్మి మీ ఇంటికి వచ్చిన కోడలితో మాట ఏదైనా సౌమ్యంగా చెప్పటం, ఆమెను ఆదరంగా చూడటం చేసి చూడండీ....! అపుడు ఆ అమ్మాయీ తన కన్నవాళ్ళకంటె మిమ్మల్నే ఎక్కువ ఆదరంగా చూస్తుంది కదా...!"

అపుడు గవరమ్మ గోదావరమ్మ చేతిలోని పుస్తకాన్ని గమనించింది. ఒక క్షణం ఆలోచనగా తలాడించింది. "అవునమ్మా మీరు చెప్పింది నిజమే ననిపిస్తోంది! గట్టిగా చెప్పటం వలన నేనేం సాధించానూ, గయ్యాళి ననే పేరు తప్ప. ఇక మీరు చెప్పినట్లే చేసి చూస్తాను!" అంటూ నిట్టూర్చి మళ్లీ అంది.

"మీరు పుస్తకాలవీ చదువుతూంటారు కాబట్టి ఇలాంటి మంచి మాటలు తెలుస్తూంటాయి...!"

గోదావరమ్మకి కొంచెం సంతోషం కలిగింది.

"అవును గవరమ్మా... ఎవరమైనా కాసేపు పుస్తకాల్నీ తిరగేస్తుంటే... మనకి కొన్ని విషయాలు తెలుస్తాయి! పుస్తకాలనేవి మనల్ని మంచి మార్గంవైపు నడిపిస్తాయి... వెలుగును చూపిస్తాయి...!"

గవరమ్మా లేచి నిలబడి .."వచ్చినందుకు మిమ్మల్ని కలిసి... రెండు మంచి మాటల్ని చెవిని వేసుకుని వెళ్తున్నాను. మరోసారి తీరిగ్గా మళ్ళీ వస్తానమ్మా..." అంటూ ఇద్దరివైపూ చూసి వెళ్ళిపోయింది.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక సీత ఆవిడతో అంది "అమ్మా... మీరు తీరిగ్గా పుస్తకం చదువుకుంటుంటే... వీళ్ళ దగ్గరకు పిలిచి... తప్పు చేసానా...? మిమ్మల్ని చూడటానికే వచ్చారని నాకూ అనిపించి మీకూ చెప్పాను...!"

“పుస్తకాల్ని చదవడం ఎలాగూ జరుగుతుంది. వాటికంటె మనుషులే ముఖ్యం కదా...! ఆ కనకమ్మగారు ఎందుకు వచ్చిందో తెలుసా...? ఆవిడకేదో సమస్య ఉండి మనల్ని సాయం కోరటంలా కాకుండా.. ఆవిడకు సహాయం చేసే సదవకాశాన్ని మనకు ఇవ్వజూపుతున్నట్లుగా ఉంది, ఆవిడ ధోరణి ! ఆవిడ మాటలకు భలే నవ్వొచ్చిందిలే! కులం గురించి నేనూ అనుకునేది నిష్కర్షగా చెప్పటంలో ఆవిడకు కొంచెం కోపం కలిగినట్లుంది. అయినా మనసులోని మాటను మాత్రం చెప్పకుండా ఉండలేకపోయాను.... నిజం మాట్లాడితే, కులంతో ఎవరికైనా వచ్చే గొప్పతనం ఏముంటుందీ...? అది ఆయాచితంగా మనుష్యులకు జన్మతో లభించేదేగదా! దాన్ని గురించి గొప్పగా భావించేపనేముంది చెప్పూ...! ఎవరమైనా ఎదుటివాళ్ళ నడవడీ, వ్యక్తిత్వాన్ని బట్టీ గౌరవించగలగటం బావుంటుంది! దాన్ని బట్టే అభిమానమైనా, దురభిమానం అయినా! అంతేకదూ...?”

అవునన్నట్లుగా సీత చిరునవ్వుతో తలవూపింది.

గోదావరమ్మా చిరునవ్వుతో చూస్తూ “అవును సీతా... ఇంతకీ మనది ఏ కులం...? అంది. నువ్వు నాకు ఇల్లు ఇచ్చేటప్పుడు ఆ వివరం అడగనే లేదేం...?” మళ్ళీ ప్రశ్నించిందావిడ.

సీత నవ్వు మొహంతో ఆవిడవైపు చూసింది. “మరి... మీరూ... నేను వంట చేస్తానన్నా... మీరా వివరం అడగనే లేదుగా...?”

“అంటే... మన ఇద్దరిదీ తల్లీ కూతుళ్ళ బంధం... అనుబంధం! అంతే కాదు... ఇద్దరం కూడా మనుష్యులందరిదీ ఒకటే కులం అని నమ్మే బాపతే అన్నమాట...! అవునా...?”

సీత ఆవిడ మాటలకు తలవూపుతూ.. ‘‘అవునమ్మా... అది నా అదృష్టం! ఒంటరిగా బతుకుతున్న నాకు అండగా నిలిచారు... అమ్మలా ఆదరంగా చూస్తున్నారు...!”

గోదావరమ్మ సమాధానం చెప్పింది..“మనిషికి మనిషి తోడు తప్పక అవసరం సీతా... నీకైనా, నాకైనా! లేకపోతే జీవితమే శూన్యమనిపిస్తుంది...!” అంటూ నిట్టూర్చింది.

* * *

రోజులు గడుస్తున్నాయి.

ఆ వీధిలో గోదావరమ్మ అందరికీ పరిచయస్తురాలిగా మారింది. చాలామంది మధ్యాహ్నమో, సాయంకాలమో, ఆమె ఇంటి వద్ద ఉంటే ఇంటికీ, రామాలయానికి ప్రవచనాలు వినడానికి వెళ్తే, అక్కడికీ వెళ్ళి కలుస్తూంటారు. పిచ్చా పాటీ కబుర్లు చెప్పుకున్నట్లుగా తమ సమస్యల్నీ, బాధల్నీ చెప్పుకోవటం... వాటికి ఆమెకి తోచిన సలహాలివ్వటం మామూలు అయింది. ఒక్కోసారి ఆమెకు అవసరమనిపిస్తే... వాళ్ళకి కొద్దో గొప్పో ధన సహాయమూ చేస్తూ ఉంటుంది.

అలా రోజూ గుడికి వెళ్ళే క్రమంలోనే గుడిలో పాటలు పాడటానికి వచ్చే చిన్నమ్మాయి పట్ల గోదావరమ్మకి ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. ఆ అమ్మాయి పాటల్ని ఎంతో ఇష్టంగా వినటమే కాకుండా, ఆ అమ్మాయిని గుడికి వెంట తీసుకువచ్చే వాళ్ళ బాబాయితోనూ మంచి పరిచయం ఏర్పడింది.

అతని పేరు రామచంద్ర వర్మ.

కొంతమంది వర్మా అని పిలుస్తే మరికొంతమంది చంద్రం అంటారని అతనే గోదావరమ్మకి చెప్పాడు.

ఆవిడ మాత్రం అతనితో "నా ఇష్టదైవం రాముడు. అందుకని నేను మాత్రం నిన్ను రామం అనిగానీ, రామచంద్రం అనిగానీ పిలుస్తాను. సరేనా...?" అంటే "అలాగే... మీ ఇష్టం..." అని నవ్వు మొహంతో అతను బదులిచ్చాడు.

ఒక వారం సీతకి సెలవయిన ఆదివారం నాడు వాళ్ళని తమ ఇంటికి భోజనాలికి పిలిచి, సీతకి వాళ్ళని పరిచయం చేసింది.

అప్పటినుండీ వర్మ తనకి ఖాళీ ఉన్నపుడల్లా అన్న కూతురు కుముదనూ వెంటబెట్టుకుని సీతా వాళ్ళింటికి రావటం పరిపాటి అయింది. 'ఇంటికి ఏమైనా తెచ్చి పెట్టాలా' అని సీతను చొరవగా అడిగి చేయటం, సీత కూడా సంకోచం వదిలి అవసరమైనవి చెప్పటం జరుగుతూంది.

కుముద కాసేపు గోదావరమ్మ దగ్గర పాటలు పాడటం, తనకు రానివి ఆవిడనుండి నేర్చుకోవటం చేస్తూంటుంది. అలానే కుముద సీతకు  కూడా బాగా చేరువ అయింది. ఎపుడు వచ్చినా సీత వెంటే తిరుగుతూ చిన్న చిన్న పనుల్లో సాయం చేస్తూ మాలిమి అయింది.

సీత వర్మను ఒక్కోసారి వర్మగారూ అని పిలుస్తూ ఏదో పనులు చెబుతుంది. అపుడపుడూ వర్మ అని కూడా చనువుగా పిలవటం అలవాటయింది. వర్మకూడా అంతే... మొదట్లో సీతగారూ అనేవాడు. తరువాత్తరవాత సీతా అని చనువుగా పిలిచి మాటలు చెప్పటమూ మామూలైంది.

రంగా కూడా వర్మతోనూ..మరీ ముఖ్యంగా కుముదతోనూ చాలా బాగా కలిసిపోయాడు. వర్మ అపుడపుడూ పిల్లలిద్దర్నీ వెంటబెట్టుకుని బయటకు అలా షికారుగా తిప్పుకురావటానికో, లేక వాళ్ళకు కావలిసినవి కొనిపెట్టటానికో వెంటబెట్టుకుని తీసుకువెళ్తూండేవాడు.

పిల్లలిద్దరితో కలిసి వాళ్ళిద్దరూ అలా ఇంట్లో తిరుగుతూంటే గోదా రమ్మకు చాలా సంతోషంగా అనిపించేది!

ఒక రోజున ఆవిడ నిద్రపోవటానికి పక్కమీద వాలినపుడు పక్క గదిలోనుండి సీత ఎవరితోనో మాట్లాడటం వినిపించింది. ఎవరైనా ఇరుగు పొరుగువాళ్ళు ఏదైనా కావలిసి వచ్చారా అనుకుందావిడ.

ఆ మర్నాడు ఉదయమే చేతి సంచితో బయటకు వచ్చిన ఒకామెను సీత గోదావరమ్మకు 'మా అమ్మ' అంటూ పరిచయం చేసింది.

"రాత్రి వచ్చింది. చూడండి... రెండు రోజులైనా ఉండకుండా ఉదయమే ప్రయాణం కట్టింది...!" అంటూ సీత ఫిర్యాదు చేస్తున్నట్లుగా చెప్పింది. సీత తల్లి నిట్టూర్చింది.

"నా మాటంటే లక్ష్యం లేదు... ఏం చెప్పినా వినదు. ఇంక నేనెందుకమ్మా ఇక్కడ ఉండటం...? ఎవరో పెద్దమ్మగారట... సీతకు తోడుగా ఇంట్లో ఉంటున్నారనే మాట ఎవరిద్వారానో విని చూసి పోదామని వచ్చానండీ...! మిమ్మల్నీ చూసాను... ఇక బయలుదేరతాను... ఇంటిదగ్గర నాకు చాలా పనులున్నాయి. మీరైనా మా సీతకు తన జీవితాన్ని చక్కదిద్దుకోమని ఓ మాట చెప్పండీ. నాకెందుకనో మీ మాట వింటుందని అనిపిస్తోంది...!" అంటూ మరో మాటకు ఆస్కారం లేకుండా చకాచకా అడుగులు వే స్తూ బయలుదేరుతూంటే "నేను బస్సుస్టాండు వరకూ వెళ్ళొస్తానమ్మా..." అని గోదావరమ్మతో చెప్పి సీతకూడా ఆవిడ వెనకే వడివడిగా అడుగులు వేస్తూ బయలుదేరింది.

కాసేపటిలోనే తిరిగి వచ్చిన సీతతో గోదావరమ్మ ‘‘ఐతే... నేను వివరాలన్నీ అడగనుగానీ... ఒక్కమాట మాత్రం అడుగుతాను. అదీ మీ అమ్మగారి మాటలవల్ల అనుమానం వచ్చిందిలే... రంగా తండ్రి గురించి...” అంది సీతవైపుకొంచెం సంకోచంగా చూస్తూ.

సీత తల కొద్దిగా వాల్చుకుంది.

నెమ్మదిగా గొణిగినట్లుగా సమాధానం చెప్పింది “అతను ఈ భూమ్మీదనే లేడమ్మా...!”

ఆ ఒక్కమాటా చెప్పి అక్కడ నిలబడకుండా రివ్వున లోపలకు వెళ్ళిపోయింది సీత.

గోదావరమ్మ నిర్ఘాంతపోయింది...’అంటే... అతను చనిపోయాడా...?’

రంగా తండ్రి కనుపించకపోవటంతో ఈ మాటని అడగాలని గోదావరమ్మ ఎపుడో అనుకుంది కానీ అనవసరమేమో... ఏదైనా అపార్థాలతోనో, అభిప్రాయబేధాలతోనో విడి విడిగా ఉంటున్నారేమో అనుకుంది!

కానీ ఈ రోజు... సీత తల్లి ‘తను అయినా సీతకు మంచి మాట చెప్పి, సీత జీవితాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేయొచ్చుకదా’ అనటంతో గోదావరమ్మకు ధైర్యం వచ్చి అడిగింది. సీత వెనుక ఏదో కథ ఉంది... అని ఆవిడకు అనిపించింది.

ఆ మరునాడు గోదావరమ్మ బయటకు వెళ్ళటంతో... సీతకు స్కూలు లేకపోవటం వలన తీరుబడిగా ఇంటిపనులు మొదలు పెట్టింది. గోదావరమ్మ సాధారణంగా తనగదిని తనే శుభ్రం చేసుకుంటుంది. ఆ పని సీతను చేయనివ్వదు.

కానీ ఆ రోజు ఆమె హడావుడిగా బయటకు వెళ్ళటంతో సీత ఆ పని తనే చేస్తూ సరిగా మూత వేయని ఆమె పెట్టెను వేస్తూ చీరల అడుగున పేర్చి ఉన్న డబ్బు కట్టలను చూసి నిర్ఘాంతపోయింది. ‘ఈవిడ వెనక ఏదో కథ ఉంది’... అనుకుంది సీత మనసులో.